క్లుప్తంగా

22న సహృదయ ఉగాది ఉత్సవం

హన్మకొండ కల్చరల్: ఈనెల 22వ తేదీన ఉగాది పండుగను పురస్కరించుకుని సాయంత్రం 6.15గంటలకు సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో ఉగాది ఉత్సవం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గన్నమరాజు గిరిజామనోహర్‌బాబు, డాక్టర్ ఎన్‌వీఎన్ చారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ జ్యోతిష్య పండితుడు నమిలికొండ విశ్వేశ్వరరావు.. శోభాకృత్ సంవత్సర పంచాంగ పఠనం చేస్తారని పేర్కొన్నారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన వేణుగాన విద్వాంసుడు నాళ్ల చెరువు ఆనంద తీర్థ ఆధ్వర్యంలో సంగీత విభావరి జరుగుతుందని తెలిపారు.

గోశాల ప్రారంభం

హసన్‌పర్తి: సాకేత రామాలయ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో గోశాలను స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్ శనివారం ప్రారంభించారు. అనంతరం యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో పర్వతగిరి జెడ్పీటీసీ సభ్యుడు సింగులాల్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జంగా కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అశోక్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

రామన్నపేట: నేత్రదానం చేయడం వల్ల ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. వరంగల్ కాకతీయ థియేటర్ సమీపంలోని మామిడాల మల్లమ్మ (90) అనారోగ్య సమస్యలతో మరణించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో మృతురాలి నేత్రాలను నేత్ర వైద్యశాలకు శనివారం అందజేశారు.

మృతురాలి నేత్రాల సేకరణ

కాజీపేట రూరల్: కాజీపేట సిద్ధార్థనగర్‌కు చెందిన జులియానమ్మ శనివారం అకాల మరణం చెందారు. ఈమేరకు కుటుంబ సభ్యుల సమ్మతితో సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు టి.శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐవీపీ టెక్నీషియన్లు నరేందర్, రాజేంద్రప్రసాద్ సహకారంతో మృతురాలి నేత్రాలు సేకరించారు. ఈ సందర్భంగా వాటిని హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు పంపించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అంబులెన్స్‌లో శిశువు జననం



ఖిలా వరంగల్: వరంగల్ పుప్పాలగుట్ట ప్రాంతానికి చెందిన ఓ మహిళ పురిటి నొప్పులతో బాధపడుతోంది. శనివారం మధ్యాహ్నం అంబులెన్స్ వాహనంలో సీకేఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే ఖిలా వరంగల్ పెట్రోల్‌బంక్ సమీపంలో మగశిశువుకు జన్మనిచ్చింది. దాంతో వారిని ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ స్వాతి, పైలట్ సాంబయ్య తెలిపారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

హసన్‌పర్తి: 55వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ జక్కుల రజిత అన్నారు. డివిజన్‌లోని మసీదు ప్రాంతంలో సుమారు రూ.10లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండేళ్లలో దాదాపు ఎనభై శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. అనంతరం డివిజన్‌లోని ఎస్సీ కాలనీ, సాయినగర్‌కాలనీ, గొల్లవాడల్లో దోమ నివారణ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్‌బాబు, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాయకపు శ్రీనివాస్, బీఆర్ఎస్ డివిజన్ మాజీ గౌరవ అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దళిత బహుజన సాహిత్య అకాడమీ జిల్లా అధ్యక్షుడు గోవర్దన్ పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి సహకరిస్తా

కరీమాబాద్: వరంగల్ నానామియాతోటలో నిర్మించనున్న పోచమ్మ గుడి నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. పదేళ్ల క్రితం వెలసిన పోచమ్మ దేవతకు ఇప్పటివరకు గుడి లేకపోవడంతో గుడి నిర్మాణానికి స్థానికులు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులకు కార్పొరేటర్ శనివారం శంకుస్థాపన చేశారు. శ్రీనివాస్, కుమారస్వామి, కిషన్, సుధాకర్, భరత్, రఘు, తిరుపతి, సోమనాథ్, మల్లయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలో శనివారం మధ్యాహ్నం ఓ వ్యక్తిపై కుక్కల గుంపు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 41వ డివిజన్ శంభునిపేట ఖదీర్‌పూర్ వీధికి చెందిన ఎండీ.అబిద్ అలీ (45) కూలీ పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు నడుచుకుంటూ ఇంటికి బయల్దేరాడు. ఈక్రమంలో అతడిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమి, వెంటనే క్షతగాత్రుడిని ఆటోలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై విచారణ చేపట్టాలి



వరంగల్ చౌరస్తా: వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

వరంగల్ చౌరస్తా: టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ హెడ్ పోస్టాఫీస్ వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని సూచించారు. రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించింది. దాంతో ఇంతేజార్‌గంజ్ పోలీసులు అక్కడికి చేరుకుని నాయకులను అరెస్టు చేసి అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీధర్, నాయకులు ఎరబ్రెల్లి ప్రదీప్‌రావు, ఎడ్ల అశోక్‌రెడ్డి, బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, పిట్టల కిరణ్, కాసు శిల్ప, గడ్డల కుమార్, వెంకటేశ్వర్లు, మహేష్, మురళి కృష్ణ, మాదాసు రాజు, ఒంటెల ప్రసాద్, చిన్న, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిలిమ్స్ క్వాలిఫై అయిన వారికి న్యాయం చేయాలి

హన్మకొండ: టీఎస్‌పీఎస్సీ గ్రూప్ -1 ప్రిలిమ్స్ క్వాలిఫై అయినా 25వేల మందికి న్యాయం చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు కోరారు. పేపర్ లీకేజీ ఆరోపణలతో గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేయడం వలన ఇప్పటికే మెయిన్స్‌కు ఎంపికైన 25వేల మంది ఆందోళనకు గురవుతారని చెప్పారు. పరీక్ష పత్రం లీకేజీపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి మెయిన్స్ ఎంపికైన వారికి న్యాయం చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. గ్రూప్ -1 పేపర్ లీక్ కాలేదని సిట్ చెప్పినా ప్రభుత్వం ఆ పరీక్షను కూడా రద్దు చేసిందని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన టీఎస్‌పీఎస్సీ ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని తిరుహరి హరి పేర్కొన్నారు.



నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

కూరగాయల మార్కెట్ పరిశుభ్రం



చిత్తడిగా మారిన మార్కెట్‌లోని రహదారి (ఫైల్)



వ్యర్థాలు తొలగించిన తర్వాత..

సాక్షి స్పందన

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌తో పాటు ప్రధాన రోడ్డు, పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయని 'అపరిశుభ్రంగా కూరగాయల మార్కెట్' అనే శీర్షికన శనివారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రేటర్ మున్సిపాలిటీ సిబ్బంది వచ్చి జేసీబీతో ప్రధాన రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, వ్యర్థాలను శనివారం ఉదయం తొలగించారు. 500మీటర్లు ఉన్న రహదారిపై తీసిన మట్టి, వ్యర్థాలను 8ట్రాక్టర్లలో నింపి తొలగించారంటే చెత్తాచెదారం ఏమేరకు పేరుకుపోయిందో అర్థమవుతోంది. వ్యర్థాలను కార్పొరేషన్ సిబ్బంది తొలగించడంతో కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మార్కెట్, గ్రేటర్ కార్పొరేషన్ అధికారులను కోరారు.

తక్కువ ప్రీమియం.. ఎక్కువ ప్రయోజనం

కాజీపేట: తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాలను కల్పించనున్న బీమా పాలసీలలో చేరడానికి ప్రజలు మరింతగా ముందుకు రావాలని తపాలా శాఖ హనుమకొండ డివిజన్ పర్యవేక్షకుడు బానోతు నందా కోరారు. కాజీపేట మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీసు కార్యాలయంలో జీవిత బీమా పాలసీలపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుంచి 31వరకు డివిజన్ స్థాయిలోని అన్ని గామాలు, పట్టణాల్లో ప్రత్యేక మేళాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో సహాయ డివిజన్ పర్యవేక్షకులు శ్రీహరి కృష్ణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న నందా

స్పీడ్ పోస్టులో రాములోరి తలంబ్రాలు

శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని స్పీడ్ పోస్టు ద్వారా తలంబ్రాలు అందించడానికి పోస్టాఫీసులలో తగిన ఏర్పాట్లు చేసినట్లు కాజీపేట సబ్ పోస్ట్‌మాస్టర్ రాజేందర్ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం శారదాబాయి



కాజీపేట: విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

ఖిలా వరంగల్: విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఈక్రమంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని ప్రధానోపాధ్యాయులు శారదాబాయి, సీఎంఓ సుభాష్ సూచించారు. పాఠశాల విద్య డైరెక్టర్, డీఈఓ ఆదేశాల మేరకు వరంగల్ శంభునిపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రవీందర్ అధ్యక్షతన శనివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను ఉపయోగించుకుని మంచిగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిర, సత్యనారాయణ, తస్నీమా ఆరా నషేస్, అహ్మద్ ఖాన్, హాజిపాషా, శ్రీధర్, వెంకన్న, రామస్వామి, లకుపతి, రవీందర్, రమాదేవి, జగదీశ్వర్, హస్నజామా, అమోషా, కీసర్, నసీమా పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో సమీక్షించిన ఉపాధ్యాయులు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల చదువులపై ఉపాధ్యాయులు సమీక్షించారు. విద్యార్థుల సామర్థ్యాలను తల్లిదండ్రులకు క్లాస్ టీచర్లు వివరించారు.

మెట్టుగుట్టపై శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



అర్చకులకు వస్త్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ రాధికారెడ్డి, తదితరులు

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ నవమి నవరాత్రోత్సవాలను శనివారం ప్రారంభించారు. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మంత్రపుష్పం, సాయంత్రం మహామునిి (గురు) పూజ, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. పూజా కార్యక్రమంలో శివాలయ, రామాలయ కార్యనిర్వహణాధికారి కె.శేషుభారతి, అర్చకులు రామాచారి, విష్ణువర్ధనచార్యులు, అభిలాష్‌శర్మ, సత్యనారాయణశర్మ, మంత్రోత్సరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, శ్రీరామనవమి నవరాత్రోత్సవాల్లో భాగంగా 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధిక - నరోత్తంరెడ్డి దంపతులు స్వామివార్లకు పట్టు వస్త్రాలు, అర్చకులకు దీక్ష వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు భూపాల్‌రెడ్డి, ఓర్సు రాజు, రాజగోపాల్‌రెడ్డి - శ్రీకళ, వేణుగోపాల్‌రెడ్డి - కళ్యాణి దంపతులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో లక్ష గరిక పూజలు



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురిలోని స్వయంభూ శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలో స్వామి వారికి శనివారం లక్ష గరిక పూజలను భక్తులు నిర్వహించారు. దేవాలయ వ్యవస్థాపకుడు అయినవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో మానస సరోవరం నుంచి తెచ్చిన జలంతో స్వామి వారికి సహస్రధారలతో పండితులు అభిషేకం చేశారు. దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ వెంకటేశ్వర్లు శర్మ పర్యవేక్షణలో పూజలు చేశారు. ఆలయ ఆస్థాన వేదపండితులు ఐనవోలు రాధాకృష్ణశర్మ, సాయికృష్ణశర్మ, ఆలయ ఆస్థాన గాయకులు మహతి, కళ్యాణి, సుధీర్, మణిదీప్, రవి, శివ, శ్రీనాథ్, సృజన పాల్గొన్నారు.

కేయూలో ముగిసిన జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ఓయూ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఇంప్లికేషన్స్ ఆఫ్ ఎన్ఈపీ -2020 ఆన్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్, ఇష్యూస్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై చర్చించారు. ముగింపు సభలో ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ జి.నరేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జాతీయ విద్యావిధానంతో మేనేజ్‌మెంట్ విద్యలోనూ అనేక మార్పులు రాబోతున్నాయని చెప్పారు. టెక్నాలజీని వినియోగించుకోవాలని, సర్టిఫికెట్ కోర్సులపై కూడా దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆనంద్ మాట్లాడుతూ జాతీయ నూతన విద్యావిధానంలో రాబోతున్న మార్పులపై విద్యాబోధనలో అధ్యాపకుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. వరంగల్ నిట్ కామర్స్ ప్రొఫెసర్ రామ్‌లాల్, కేయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్, ఈ సెమినార్ డైరెక్టర్ ఆచార్య పి.వరలక్ష్మి మాట్లాడారు. 25 మంది ఈ సదస్సులో పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ సమావేశంలో కళాశాల డీన్ ఆచార్య రాజిరెడ్డి, అధ్యాపకులు ప్రగతి, ఫణీందర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీ సాధనతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 20న నిర్వహించే విద్యుత్ ఉద్యోగుల బహిరంగ సభకు యూనియన్లు, అసోసియేషన్‌లకు అతీతంగా విద్యుత్ ఉద్యోగులందరు తరలిరావాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రతినిధులు బి.సామ్యా నాయక్, ఎ.ఆనందం, ఎన్.సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. హనుమకొండ బేతి కేశవరెడ్డి కాలనీలో టీఎస్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ బహిరంగ సభ సన్నాహక సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈనెల 24న జరగబోయే మహా ధర్నాకు ఉద్యోగుల్లో స్ఫూర్తిని, చైతన్యాన్ని నింపేందుకు ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హంటర్‌రోడ్డు సహకార నగర్‌లోని విష్ణుప్రియ గార్డెన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సభకు టీఎస్ పవర్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, కన్వీనర్‌తో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నారని చెప్పారు.



సమావేశంలో పాల్గొన్న జేఏసీ నాయకులు

శోభాయాత్రను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్‌లో ఏప్రిల్ 6న నిర్వహించనున్న వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు. రంగశాయిపేట మహంకాళి దేవాలయంలో శనివారం పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్ర మహంకాళి దేవాలయం నుంచి హనుమకొండలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయం వరకు సాగుతుందని వివరించారు. శోభాయాత్ర (బైక్ ర్యాలీ) ప్రారంభం సందర్భంగా పదివేల మందితో సామూహిక హనుమాన్ చాలీసా పఠనం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు కేసీరెడ్డి జయపాల్‌రెడ్డి, కుసుమ సతీష్, గూడూరు రాకేశ్, ఏడెల్లి సందీప్‌రెడ్డి, సుతారి సాయిరాం, రాజు, అశోక్, ప్రమోద్, కోటేశ్వర్, ప్రవీణ్, మల్లేషం, వీరేశం, దీన్‌దయాల్, భూపాల్, రాజేందర్, భాస్కర్, కుమార్, కిషోర్, కార్తీక్, రంజిత్, సత్యనారాయణ, భరత్, మోహనాచారి, పరమేశ్వర్, కృష్ణ, వేణు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు సర్టిఫికెట్ల ప్రదానం

మడికొండ: దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రంలో మూడు రోజుల శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు సర్టిఫికెట్లను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సబిత శనివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ జయశ్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సబిత మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్‌వాడీల పాత్ర చాలా కీలకం అని అన్నారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతీ విషయాన్ని విధి నిర్వహణలో అమలు పర్చాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ములుగు జిల్లాకు చెందిన 538మంది, ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన 783మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డబ్ల్యూడీసీడబ్ల్యూ ఆర్‌జేడీ ఝాన్సీరాణి, విజయశ్రీ, ప్రాంగణం సిబ్బంది హేమరాణి, మంజుల, హఫీజ్, కళ్యాణ్, బాబు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న జయశ్రీ, తదితరులు

విద్య, వైద్య రంగాల్లో వరంగల్ అభివృద్ధి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రెడ్డి

మామునూరు: తెలంగాణలో హైదరాబాద్ తర్వాత విద్య, వైద్య రంగాల్లో వరంగల్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలో వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ సీహెచ్ నరసింహరెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ సీహెచ్ దేవేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ సీహెచ్ సత్యపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం రాత్రి కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథులుగా వారు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసపత్రాలు అందజేసి వారిని అభినందించారు. అంతకు ముందు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో కళాశాల డైరెక్టర్ వాణిదేవి, వాహినిదేవి, ప్రిన్స్‌పాళ్లు ప్రకాశ్, ప్రసాద్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతిరావు, డీన్ శశిధర్, శర్మ, కన్వీనర్ సంతోష్, సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



మాట్లాడుతున్న పున్నమాచార్యులు

నయీంనగర్: 20హెచ్‌పీ లోపు విద్యుత్ వాడకం ఉన్న కుటీర పరిశ్రమలన్నింటికి రైతులతో సమానంగా 24గంటల పాటు ఉచిత విద్యుత్ ఇచ్చి ఆదుకోవాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ అధ్యక్షుడు రాచమల్ల పున్నమాచార్యులు కోరారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వకర్మీయులలోని కంచర, దేవశిల్పి, స్వర్ణకార కుటీర పరిశ్రమలకు కనీసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని సూచించారు. 10హెచ్‌పీ లోపు విద్యుత్తు వాడకం ఉన్న పిండి, మిర్చి, కుటీర పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఎల్‌టీ కేటగిరి -4 ధరలు వర్తింపచేసి ఆదుకోవాలని కోరారు. పారిశ్రామిక ఉత్పత్తుల ఉక్కుపాదాల కింద నలిగిపోతున్న పట్టణ ప్రాంతంలోని కుటీర పరిశ్రమలన్నింటికీ కుల, మత వర్గాలకు అతీతంగా రూ.2కు యూనిట్ విద్యుత్ అందించి కుటీర పరిశ్రమలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బిట్ల చక్రపాణి, కృష్ణాజి రవీంద్రచారి, వెలిసోజు బుచ్చిరాములు, కురిమిల్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

దేశపతి శ్రీనివాస్‌కు చీఫ్‌విప్ శుభాకాంక్షలు

హన్మకొండ: కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్ ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా ఆయనను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కోటాలో ఏకగ్రీవంగా ఎన్నికైన దేశపతి శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పిస్తున్నారని అన్నారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన దేశపతి శ్రీనివాస్.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చేసిన మేథోపరమైన కృషిని గుర్తించి రాష్ట్ర సాధన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ సముచిత స్థానం కల్పించారని గుర్తుచేశారు. ఉద్యమకారుడికి గుర్తింపు ఇచ్చి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన కేసీఆర్‌కు వినయ్‌భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు.

సీడీయూ పరీక్ష ఫలితాల విడుదల

నయీంనగర్: హనుమకొండ కిషన్‌పుర చైతన్య (డీమ్డ్ టు బీ యూనివర్సిటీ) పీజీ, ఎంటెక్, ఎం.ఫార్మసీ 3వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కులపతి సీహెచ్ వి.పురుషోత్తంరెడ్డి శనివారం విడుదల చేశారు. పీజీ 3వ సెమిస్టర్ అన్ని కోర్సుల్లో 127 మంది విద్యార్థులు హాజరు కాగా, 110 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంబీఏ, ఎంసీఏ 3వ సెమిస్టర్ పరీక్షల్లో 190, ఎంటెక్ (సీఎస్సీ)లో ఇద్దరు, ఎం.ఫార్మసీలో 11 మంది ఉత్తీర్ణులైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఇనుగాల విక్రమ్ రెడ్డి, ఉపకులపతి జి.దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.రవీందర్, ఓఎస్‌డీ డాక్టర్ వీరవెంకటయ్య, పరీక్షల నియంత్రణాధికారులు, డీన్స్, వివిధ శాఖాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

సంఘర్షణ సభను విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్: ఈనెల 25న కేయూ వివిధ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులు సంఘర్షణ సభను విజయవంతం చేయాలని ఉస్మానియా, పాలమూరు యూనివర్సిటీల్లో ఆయా యూనివర్సిటీల్లోని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులతో కలిసి కేయూ జేఏసీ బాధ్యులు కరపత్రాలు, పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఓయూ జేఏసీ నాయకులు కోట శ్రీనివాస్, మామిడకాయల పరశురాం, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు తూము నవీన్‌కుమార్, ఆంజనేయులు, పవన్‌రెడ్డి, బాలు, వెంకట్, రూప్‌సింగ్, కిరణ్, శ్రీధర్‌తో పాటు ఓయూ, పాలమూరు యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో కేయూ జేఏసీ బాధ్యులు ఇట్టబోయిన తిరుపతియాదవ్, బాధ్యులు విజయ్‌కన్నా, గుగులోతు రాజునాయక్, మేడ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

నిట్‌లో పవన్‌కల్యాణ్ చీఫ్ సెక్యూరిటీ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో సినీహీరో, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చీఫ్ సెక్యూరిటీ శనివారం పర్యటించారు. ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిట్ వరంగల్‌లో నిర్వహించనున్న స్ప్రింగ్ స్ప్రీ -23 వేడుకల్లో ముఖ్యఅతిథిగా పవన్ కల్యాణ్ పాల్గొననున్న సందర్భంగా నిట్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. పవన్ కల్యాణ్ పాల్గొనే తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం. కాగా, పవన్‌కల్యాణ్ చీఫ్ సెక్యూరిటీకి నిట్ స్టూడెంట్ కౌన్సిల్, సిబ్బంది స్వాగతం పలికి, స్ప్రింగ్ స్ప్రీ వివరాలు తెలిపారు.


మహిళల రక్షణకు షీ టీం

నయీంనగర్: మహిళల రక్షణకు షీ టీం బృందం పనిచేస్తోందని ఏసీపీ డేవిడ్‌రాజ్ అన్నారు. హనుమకొండ కిషన్‌పుర ప్రాంతంలో షీ టీం బృందం రెక్కీ నిర్వహించి యువతులు, మహిళలను వేధిస్తున్న 16 మంది ఆకతాయిలను శనివారం పట్టుకొని తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చింది. ఆపద సమయంలో 87126 85257, 87126 85142, 87126 85270 నంబర్లకు యువతులు, విద్యార్థినులు, మహిళలు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఏసీపీ కోరారు. కార్యక్రమంలో సీఐ సంజీవరావు, ఎస్సైలు కుమారస్వామి, విద్యాసాగర్, స్వాతి, ఏఎస్సై వేణుగోపాల్ రెడ్డి, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డీజే సీజ్

హసన్‌పర్తి: ఎలాంటి అనుమతి లేకుండా వినియోగించిన డీజేను పోలీసులు శుక్రవారం రాత్రి సీజ్ చేశారు. భీమారం సెంటర్‌లో పెళ్లి డీజే ఏర్పాటు చేసి ధ్వని కాలుష్యాన్ని కలిగించడంపై స్థానికుల ఫిర్యాదు మేరకు డీజేను సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ దయాకర్ తెలిపారు. రాత్రివేళ డీజేలు వినియోగిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని హెచ్చరించారు.

ఏవీవీ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



రామన్నపేట: వరంగల్ ఏవీవీ డిగ్రీ కళాశాలలో స్ఫూర్తి స్పందన పబ్లిక్ లిమిటెడ్ మేనేజర్ ఆఫీసర్ పోస్టులకు శనివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు డిగ్రీ తరువాత ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో చాలా కంపెనీలు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించబోతున్నట్లు చెప్పారు. కాగా, ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 19 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు నాగేశ్వర్‌రావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భుజేందర్ రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.